Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :23 సంచిక :102 సంపాదకులు: కోటకొండ ఎర్ల విజయరాజు బుధవారం 30 జులై 2025 పేజీలు :12 వేల రూ5 /-

# పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం

**ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా భారత్ తిప్పికొడుతుందన్నారు**

**రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**



**న్యూఢిల్లీ జూలై 29:** ఆపరేషన్ సింధూర్‌పై మంగళవారం రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్ధాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు.ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలనుకుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు. ఏదో ఒక రోజు పీవోకే ప్రజలు ఇండియాతో కలుస్తారని, భారతీయులమని చెప్పుకునేందుకు వాళ్లు గర్వపడుతారని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు.కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆపరేషన్ సింధూర్ లక్ష్యం కేవలం పాకిస్థాన్‌ను శిక్షించడమే అని, కానీ ఆ దేశంపై యుద్ధం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న 9 ఉగ్ర స్థావరాలపై ఇండియా దాడి చేసిందని, ఆ దాడిలో ఒక్క పాకిస్థానీ పౌరుడు కూడా మరణించలేదని మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు.మరో వైపు లోక్‌సభలో హెూంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్లో ట్వీట్ చేశారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహాదవ్‌పై ఆ ప్రసంగంలో పూర్తి వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

# 31 నుంచి మీనాక్షి పాదయాత్ర....

**హైదరాబాద్, జూలై 29:**తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ జులై 31 నుండి తెలంగాణలో పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో సంబంధాలను బలపరచడం, ప్రభుత్వ విధానాలను ప్రచారం చేయడం కోసం అని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. వారం రోజుల షెడ్యూల్ ను ఖరారు చేశారు. రోజుకో నియోజకవర్గంలో ప్రతి నియోజకవర్గంలో 8 నుండి 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తారు. పూర్తి డీటైల్స్ ప్రకటించాల్సి ఉంది. మీనాక్షి నటరాజన్ ఫిబ్రవరిలో తెలంగాణ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. అంతకు ముందు వరకూ దీపాదాస్ మున్షి ఉండేవారు. మీనాక్షి నటరాజన్ ఎన్ఎస్‌యూఐ నుండి పార్టీలో ఎదిగారు. మధ్యప్రదేశ్ యూత్ కాంగ్రెస్‌లో కీలక నేతగా పని చేశారు. 2009లో మధ్యప్రదేశ్‌లోని మండ్సౌర్ నుండి ఎంపీగా గెలిచారు. రాహుల్ గాంధీకి అత్యంత ఇష్టమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ప్రభుత్వం ఉన్నటికీ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకత్వం అంత చురుగ్గా లేదన్న అభిప్రాయంతో వారిని యాక్టివ్ చేసేందుకు మీనాక్షి నటరాజన్ ప్రయత్నిస్తున్నారు. స్థానిక ఎన్నికలు కూడా రానున్న సమయంలో ప్రజల సమస్యలను నేరుగా వినడం, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ, వెనుకబడిన తరగతుల కుల గణన వంటి పథకాలను



ప్రచారం చేయడానికిపాదయాత్ర అవసరమని నిర్ణయ్నికి వచ్చారు. ఈ పాదయాత్రను అంతర్గత సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించుకునే అవకాశం ఉంది. పార్టీలోని సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం మెరుగుపరచడం , అసంతృప్త నాయకుల సమస్యలను పరిష్కరించడం వంటివి మీనాక్షి నటరాజన్ చేపట్టే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన హామీలను అమలు చేసినప్పటికీ ఇంకా అనేక పథకాలు అమలు చేయాల్సి ఉందని.. అమలు చేసిన పథకాలు కూడా పూర్తిగా చేయలేదని విమర్శిస్తున్నారు. మొత్తం ఆరు వందల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తారని.. కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నగారా కూడా త్వరలోనే మోగనుండటంతో.. పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా మీనాక్షి నటరాజన్ ప్రణాళికలు రచిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు ఆమె కృషి చేయనున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ఆమె స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. రాష్ట్రంలో 15 రోజులు పాటు ఉండనున్న ఆమె.. జూలై 29న పీసీసీ చీఫ్‌తో సమావేశం కానున్నారు. ఈ నెల 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో ఆమె పాదయాత్ర మొదలవ్వనుంది. పరిగి సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్న ఆమె తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్రతో పాటు రాత్రి బస కూడా ఏర్పాటు చేయాలని ఆమె భావిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలలో పాదయాత్ర చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.ఒకవైపు పాదయాత్రలు చేస్తూనే మరోవైపు జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీటింగ్ కూడా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగానే ముందుగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో రేపు సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించి.. రాష్ట్రంలోని పాలన, గ్రూపు రాజకీయాలపై సమాచారం తెలుసుకోనున్నారు.



# తెలంగాణ మంత్రులతో ఢిల్లీకి సీఎం రేవంత్

**రిజర్వేషన్లపై భారీ ధర్నా**

**హైదరాబాద్:**తెలంగాణ మంత్రులతో ఢిల్లీకి సీఎం రేవంత్ రిజర్వేషన్ల పై భారీ ధర్నా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆగష్టు 5న మంత్రులతో కలిసి సీఎం ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను కలవనున్నారు. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమి మద్దతు కూడా కోరనున్నారు. 6న ధర్నా చేపట్టనున్నారు.ం

## తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల నియామకానికి కేంద్రం ఆమోదం

**హైదరాబాద్:**తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల నియామకానికి కేంద్రం ఆమోదం తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ ప్రమాణం చేయనున్నారు.

# నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీరు దిగువకు విడుదల

**నాగార్జునసాగర్ ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారిగా 18 సంవత్సరాల తర్వాత జూలై నెలలోనే సాగునీటి విడుదల**

**నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం**

**రాష్ట్రంలోని ప్రాజెక్టులను ఆధునికరిస్తాము. పూడిక తీస్తాం-రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.**

**నల్గొండ జూలై 29:**బీరాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు . మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల లోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహుదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు.తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా



ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు.సాగునీటితో పాటు నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు.

# ఫామ్ ఆయిల్ పంటతో ఆర్ధిక బలం

**మంత్రి తుమ్మల**



**వికారాబాద్:** పామ్ ఆయిల్ పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. వికారాబాద్ పరిసర ప్రాంతంలోని కొత్రేపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాన్ టేషన్ డ్రైవ్ లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రైతులను ఆదుకునే దిశగా పనిచేస్తుందన్నారు. పామ్ ఆయిల్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించడంతో పాటు మూడు సంవత్సరాల పాటు అంతర్గత కూరగాయ పంటలతో వ్యవసాయం సాగు చేయవచ్చునని మంత్రి తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాముఖ్యత నిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు.ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర లోనే వ్యవసాయ రంగం కోసం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, రైతులను రుణ బారం నుండి విముక్తులను చేయడానికి 25 లక్షల మంది రైతులకు చెందిన 21 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందని సభాపతి తెలిపారు. రైతు భరోసా ను ఏడాదికి ఎకరాకు 12 వేలకు పెంచి కేవలం తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో వేయడం జరిగిందని ఆయన అన్నారు. రైతు బీమా, సన్న రకాల వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్, వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ యాస్మీన్ భాష, డిప్యూటీ డైరెక్టర్ నీరజ గాంధీ , జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి రాజా రత్నం, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# అరకోటి మంది ఓటర్లెక్కడ?

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా నవీకరణ సుప్రీంకోర్టులో విచారణ దశలోనే వున్నా, పార్లమెంటులో అలజడి రేగుతున్నాఆ ప్రక్రియ తన దోవన తాను ముందుకెళుతున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ గురువారం ఆ వ్యవహారం గురించి వెల్లడించిన వివరాల ప్రకారం, లక్షమందికి పైగా ఓటర్ల ఆచూకీ లేదు. 21.6 లక్షల మంది మరణించారు. మరో 31.5 లక్షల మంది శాశ్వతంగా వేరే చోటుకు వలసపోయారు. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) అడుగుతున్నా, మరో ఏడు లక్షల మంది ఇంతవరకూ తమ పత్రాలు దాఖలు చేయలేదు. తాము ఫలానా చోట ఉంటున్నామని రుజువులు చూపక పోయినా, బతికే ఉన్నామని చెప్పకపోయినా లేదా తగిన పత్రాలుఅందజేయక పోయినా ఈ 61 లక్షల మంది ఓటర్లు జాబితా నుంచి శాశ్వతంగా కనుమరుగవుతారు. రాష్ట్ర ఓటర్లలో వీరు 7.7 శాతం. శుక్రవారం సాయంత్రంతో వీరందరికీ గడువు ముగిసిపోయింది. సవరించిన ఓటర్ల జాబితా ఆగస్టు 1న విడుదలవుతుంది. అయితే సెప్టెంబర్ 1లోగా ఎవరైనా జాబితాలో తమ పేరు లేదని ఫిర్యాదు చేస్తే పరిశీలించి, తగిన పత్రాలున్న పక్షంలో వారిని చేర్చి తుది జాబితా విడుదల చేస్తారు. నకిలీ లేదా విదేశీయులుగా గుర్తించిన వారిని తొలగించటం కోసం ప్రారంభించిన ఈ ప్రక్రియ దేశ చరిత్రలోనే మొట్టమొదటిది. 'పరిశుద్ధమైన' ఓటర్ల జాబితా రూపకల్పనే తమ లక్ష్యమని జ్ఞానేశ్ చెబుతున్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ స్వచ్ఛతా కార్యక్రమాన్ని స్వాగతించాల్సిందే. ఎందుకంటే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా నడవాలంటే మెజారిటీ ఆమోదం పొందిన ప్రభుత్వాలు ఏర్పడాలి. ప్రజల ఆదరణ ఉన్నవారే పాలకులు కావాలి. నకిలీ ఓటర్లు లేదా ఈ దేశ పౌరులు కానివారు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే స్థితి ఉంటే ఆ ఎన్నికలే ప్రహసన ప్రాయమవుతాయి. ఎన్నికలు సజావుగా పూర్తవుతున్నాయన్న భావన వల్లే ఫలితాలు వెలువడ్డాక అధికార మార్పిడి శాంతియుతంగా పూర్తవుతోంది. గత దశాబ్దాలతో పోలిస్తే ఎన్నికల హింస గణనీయంగా తగ్గింది. ఇలాంటి కారణాల వల్లే విదేశాల ఎన్నికలకు మన ఈసీ అధికారులు పరిశీలకులుగా వెళ్తున్నారు. వారు సూచిస్తున్న మార్పులకు ఎంతో విలువ ఉంటున్నది. కానీ గత ఏడాది, రెండేళ్లుగా ఈసీ వ్యవహార శైలిపై విమర్శలూ, ఆరోపణలూ వెల్లువెత్తు తున్నాయి. వాటిపై అసలే స్పందించకపోవటం లేదా మరిన్ని సందేహాలు కలిగే రీతిలో జవాబీ యటం రాజకీయ పక్షాలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. బిహార్ ఎన్నికల జాబితా సంగతే తీసుకుంటే సుప్రీంకోర్టు సూచించిన ఆధార్, రేషన్ కార్డు వగైరాలు పరిశీలనకు పనికి రావని అది ఎందుకు తిరస్కరించిందో అంతుపట్టదు. ఆధార్‌ను ప్రారంభించినప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ కార్డే ఇకపై సర్వస్వమని, దాని ఆధారంగానే పథకాల వర్తింపు అయినా, పౌరుల గుర్తింపయినాఉంటుందన్నారు. కానీ జరుగుతున్నది అందుకు విరుద్ధం. మరి విశ్వసనీయత లేని ఆధార్‌ను అన్నిటికీ అనుసంధానం చేయటం ఎందుకు? ఇప్పటికీ ఆ కార్డు సంపాదించటానికి సాధారణ పౌరులు తలకిందులవుతున్నారు. పుట్టిన చోటే నవజాత శిశువులకు ఆధార్ అందేలా తాజాగా కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటువంటి కార్డు ఓటరు గుర్తింపునకు పనికిరాదని ఈసీ ఎలా చెబుతుందో అర్థంకాని విషయం. పౌరుల్ని గుర్తించటమనే ప్రక్రియ అన్యులకు ఆసాధ్యమని, కేవలం తామే సమర్థులమని ఆ సంస్థ చెప్పదల్చుకుంటే దాన్నెవరూ అంగీకరించరు. ఎన్నికల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తటంపై ఆంధ్రప్రదేశ్ మొదలుకొని మహారాష్ట్ర, హరియాణాల వరకూ ఎన్ని ఉదాహరణలైనా చూపొచ్చు. ఏపీ సంగతే తీసుకుంటే... అక్కడ ఓటింగ్‌కు గడువు ముగిసి కేవలం ప్రాంగణంలో ఉన్న వారితో పోలింగ్ పూర్తి చేయటానికి అర్ధరాత్రి వరకూ సమయం పట్టింది. అలా వేచివున్నవారి సంఖ్య ఏకంగా 51 లక్షలు! ఇది నమ్మేలా ఉందా? ఇక పోలింగ్ శాతంపై మొదటి, చివరి ఈసీ ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడావచ్చింది. ఇది గతంలో ఎప్పుడూ ఒక శాతం మించిలేదు. ఇందువల్ల సగటున ఒక్కో అసెంబ్లీ స్థానంలో అదనంగా 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానంలో 1.96 లక్షల ఓట్లు అమాంతం పెరిగిపోయాయి. తటస్థ సంస్థల లెక్కల ప్రకారం ఇది 87 అసెంబ్లీ స్థానాల గెలుపోటముల్ని తారుమారు చేసింది! వేరే రాష్ట్రాల్లోనూ ఇలాంటి ధోరణే కనబడిందని అక్కడి విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈ సందేహాలకు సక్రమమైన జవాబు చెబితే బిహార్‌లో చేపట్టిన 'సర్'పై పెద్దగా అభ్యంతరాలు వచ్చేవి కాదేమో! కానీ ఆ సంస్థ తనకు తోచినప్పుడు మాట్లాడటం తప్ప జవాబుదారీతనాన్నీ, బాధ్యతాయుత వర్తననూ కనబరచటం లేదు. సందేహాలు పటాపంచలు చేద్దామన్న పట్టుదలను ప్రదర్శించటం లేదు. ఈసీ న్యాయబద్ధంగానే వ్యవహరిస్తున్నాననుకోవచ్చు. కానీ అలా అందరూ అనుకునేలా తన వ్యవహార శైలి వుండాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థకైనా ఇది తప్పనిసరి. అందునా ప్రభుత్వాల తలరాతలను మార్చే కీలకమైన వ్యవస్థగా ఉన్న ఈసీకి ఇది మరింత ప్రాణప్రదం. దేశంలో ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి వలసలు ఎక్కువుంటాయి. అలాంటిచోటఇంత తక్కువ వ్యవధిలో ఎక్కడెక్కడినుంచో పనులు మానుకుని వచ్చి ఓటర్లుగా నమోదు చేసుకోవటానికి అవసరమైన పత్రాలు సేకరించి సమర్పించటం బడుగు జీవులకు సాధ్యమేనా? అందుకే సర్వోన్నత న్యాయస్థానం సూచించిన ఇతర ప్రత్యామ్నాయాల గురించి కూడా ఈసీ పరిశీలించాలి. ఈ మాదిరి సవరణకు దేశవ్యాప్త ఆదరణ లభించాలంటే ఇది తప్పనిసరి.

# నిమిషకు బిగ్ రిలీఫ్..

**న్యూఢిల్లీ, జూలై 29:** చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. భారతీయ నర్సు నిమిషప్రియ విషయంలో అదే జరిగింది. ఆమె ఉరిశిక్షను రద్దు చేస్తున్నట్లు యెమెన్ అధికారులు కీలక ప్రకటన చేశారు. దీంతో ప్రియ కుటుంబసభ్యులు ఆనందంలో మునిగితేలుతున్నారు. భారత గ్రాండ్ ముఫ్తీ,సున్నీ లీడర్ కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఈ ప్రకటన వెల్లడైంది. భారత విదేశాంగ శాఖ నుంచి అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఈ నిర్ణయం తీసుకునే ముందు యెమెన్ రాజధాని సనాలో ఓ కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి ఉత్తర యెమెన్ అధికారులు, అంతర్జాతీయ దౌత్య ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ప్రియ ఉరిశిక్ష రద్దు కోసం భారత గ్రాండ్ ముఫ్తీ విజ్ఞప్తి మేరకు యెమెన్‌లో సూఫీ ముఖ్య పండితుడు షేక్ హబీబ్ ఒమర్ బిన్ హాఫీజ్ చర్చల కోసం ఓ బృందాన్ని నియమించారు. మరోవైపు అబుబాకర్ ముస్లియార్ ఉత్తర యెమెన్ ప్రభుత్వం–అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వం నెరిపారు. ఆ చర్చలు ఫలించడంతో నిమిషప్రియ ఉరిశిక్ష రద్దుకు యెమెన్ అంగీకరించినట్లు ముఫ్తీ కార్యాలయం వెల్లడించిన ప్రధాన సారాంశం. మత పండితుల జోక్యంతో నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు అయినట్లు పేర్కొంది. ఆమె విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. నిమిష ప్రియ




జైలు నుంచి విడుదల అవుతుందా? జీవిత ఖైదు పడే అవకాశం ఉందా? అనే దానిపై ఉత్కంఠ కంటిన్యూ అవుతుంది. మరణించిన యెమెన్ పౌరుడు తలాల్ మహదీ కుటుంబసభ్యులతో చర్చల తర్వాత తదుపరి నిర్ణయం వెలువడే ఛాన్స్ ఉంది. భారత ప్రభుత్వం,గ్రాండ్ ముఫ్తీ అబూ బకర్ అహ్మద్ సహా కొంతమంది మత పెద్దలు ఈ కేసులో జోక్యం చేసుకున్నారు. యెమెన్ హౌతీ అధికారులు గతంలో శిక్షను సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఉరిశిక్షను అధికారికంగా రద్దు చేయడంతో నిమిషాకు కొత్త జీవితం ఇచ్చినట్లైంది. షేక్ అబూ బకర్ అహ్మద్ ఇస్లామిక్ పండితుడు. షరియా చట్టంపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉంది. భారతదేశంలో గ్రాండ్ ముఫ్తీ అనే బిరుదు అనధికారికంగా ఉన్నప్పటికీ, దేశంలోని సున్నీ ముస్లిం సమాజంలో ఓ కీలకమైన వ్యక్తిగా పరిగణించబడతారు. 2011లో నిమిషప్రియ నర్సు ఉద్యోగం నిమిత్తం కేరళ నుంచి యెమెన్‌కు వెళ్లింది. అక్కడ పలు ఆసుపత్రిలో పని చేసిన ఆమె తర్వాత సొంతంగా క్లినిక్ ప్రారంభించాలని నిర్ణయించుకుంది. యెమెన్ చట్టం ప్రకారం విదేశీ పౌరులు స్థానిక పౌరుడితో భాగస్వామ్యం ఉంటేనే ఆ వ్యాపారం చేయవచ్చు. ఈ క్రమంలో నిమిష నర్సుగా పని చేస్తున్నప్పుడు యెమెన్ జాతీయుడు తలాల్ అబ్దో మహదీతో పరిచయం మొదలైంది. చివరకు ఇద్దరు కలిసి 2015లో ఓ క్లినిక్ ప్రారంభించారు. ఆమె వ్యక్తిగత జీవితం నుండి ఫోటోలను దొంగిలించి వారు వివాహం చేసుకున్నారని తప్పుగా పేర్కొన్నాడు మహదీ. దీంతో క్లినిక్ సంపాదన తీసుకోవడం మొదలుపెట్టాడు. చివరకు నిమిష పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నాడు. జరిగిన ఘటనతో మనస్తాపానికి గురైన నిమిష.. అధిక మోతాదులో మహదీకి మత్తుమందు ఇచ్చి చంపినట్టు అక్కడి చట్టాలు నిర్ధారించాయి. ఆమె పారిపోవడానికి ప్రయత్నించే క్రమంలో యెమెన్ అధికారులు అరెస్టు చేశారు. 2024 లో మహదీ హత్యకు నిమిషకు మరణశిక్ష విధించింది అక్కడి ప్రభుత్వం

# మాల్దీవులు దిగొచ్చింది...

**న్యూఢిల్లీ, జూలై 29:** సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం లక్షద్వీప్ గురించి నరేంద్ర మోడీ గొప్పగా చెప్పారని మాల్దీవుల ప్రభుత్వం అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసింది. భారత దేశంలో పర్యాటకం అత్యంత అధ్వానంగా ఉంటుందని.. సముద్ర తీర ప్రాంతాలను సంరక్షించుకోలేదని.. అందువల్లే అక్కడికి పర్యాటకులు ఎక్కువగా రారని పిచ్చిపిచ్చిగా వ్యాఖ్యానించింది. అంతేకాదు ఆ వ్యాఖ్యలను సమర్థించుకుంటూ నెత్తి మాసిన చైనాతో అంటకాగింది. అయితే చైనా తో స్నేహం ఎంత ప్రమాదమో.. భారతదేశంలో విరోధం ఎంత ఇబ్బందికరమో మాల్దీవులకు తెలిసి వచ్చింది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడానికి సిద్ధమైంది. వాస్తవానికి చైనా ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉంది కాబట్టి తమకు సహకరిస్తుందని మాల్దీవుల ప్రభుత్వం భావించింది. కానీ అది అంత సులభం కాదని.. తన అవసరాల కోసం మాత్రమే చైనా తమను వాడుకుందని మాల్దీవులకు అర్థమైంది. ఈ లోగానే మాల్దీవుల నుంచి భారత్ తన సైన్యాన్ని వెనక్కి రప్పించింది. ఎప్పుడైతే భారతదేశం మీద మాల్దీవుల ప్రభుత్వం అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసిందో.. అప్పటినుంచి మన దేశం నుంచి పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లడం మానేశారు. దీంతో



పర్యాటకపరంగా మాల్దీవులు తీవ్రంగా నష్టపోయింది. హోటళ్లు బోసిపోయాయి. వ్యాపారం లేక ఇతర సంస్థలు బోర్డు తిప్పేశాయి. దీంతో మాల్దీవులు ఒక్కసారిగా నేల చూపులు చూడడం మొదలుపెట్టింది.చైనాతో స్నేహం ప్రమాదకరమని.. భారతదేశాన్ని దూరం పెట్టడం తెలివి తక్కువ నిర్ణయం అని యి మాల్దీవులకు అర్థమైంది. ఆలస్యంగా నైనా గుణపాఠం నేర్చుకున్న ఆ ప్రభుత్వం ఒక్కసారిగా మోడీ శరణుజొచ్చింది. అంతేకాదు మా దేశాన్ని కాపాడాలి అంటూ కాళ్ళ మీద పడింది. వాస్తవానికి మాల్దీవులతో భారత్ ఎప్పుడూ శత్రుత్వాన్ని కోరుకోలేదు. కానీ మాల్దీవులే అనవసరంగా గెలుక్కుంది. చివరికి అది ఎంత ఇబ్బందికరమో ఆ దేశానికి తెలిసి వచ్చింది. దీంతో భారత ప్రధాని నరేంద్ర మోడీని తమ దేశానికి ఆహ్వానించింది. రెండు రోజులపాటు నరేంద్ర మోడీ అక్కడ పర్యటిస్తారు. మాల్దీవులలో పర్యటిస్తున్న ప్రధానికి అక్కడి అధికారులు, ప్రభుత్వం, ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మాల్దీవ్ రాజధాని మాలే ప్రాంతంలో రక్షణ మంత్రిత్వ శాఖ భవనంపై ఏకంగా అతిపెద్ద నరేంద్ర మోడీ భారీ చిత్రపటాన్ని ప్రదర్శించారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు.. మోడీకి అక్కడి సైనిక సిబ్బంది ఘన స్వాగతం పలికారు. మోడీ నడిచి వస్తుండగా.. రక్షణ శాఖ కార్యాలయం పై నరేంద్ర మోడీ భారీ చిత్రపటం కనిపిస్తున్న దృశ్యాలను కొంతమంది సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇప్పుడు అవి సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. బలమైన నాయకుడు ఉంటే ఎంతటి రాజ్యమైనా సరే కాళ్ళ కిందికి రావాల్సిందేనని నెటిజన్లు సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు.

# లే ఆఫ్స్ సీజన్...

రప్పా.. రప్పా.. ఇటీవల చాలా ఫేమస్ అయిన డైలాగ్ ఇది. పుష్ప2 సినిమాలోని ఈ డైలాగ్ ఇటీవల రాజకీయాల్లో వాడుతున్నారు. ఇప్పుడు ఇదే డైలాగ్ ఐటీ కంపెనీలను కూడా తాకింది. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విశ్వరూపం చూపిస్తూండటంతో ఐటీ రంగంలో అనిశ్చితి ప్రారంభమయింది. దిగ్గజాలు కూడా ఉద్యోగుల్ని భారీగా తొలగిస్తున్నాయి. ఏఐ రంగంలో నియామకాలు చేపడుతున్నాయి. లే ఆఫ్స్ చేయకుండా ఆపలేకపోతున్నామని సుందర్ పిచాయ్, సత్యనాదెళ్ల లాంటి వారు ఆవేదన చెందుతున్నారు. ఆ ప్రక్రియ ఇప్పుడు ఇండియాకూ పాకినట్లుగా కనిపిస్తోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన మ్యాన్ పవర్‌లో రెండు శాతాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో ఇండియా ఐటీ రంగంలోనూ లే ఆఫ్స్ భయం ప్రారంభమయింది.టీసీఎస్ లో ఆరు లక్షలకు మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో పన్నెండు వేల మందికి లేఆఫ్స్ ప్రకటించనుంది. ఇందకు ముందే టీసీఎస్ ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. అత్యధిక కాలం బెంచ్ పై ఉండే ఉద్యోగుల్ని పంపించేయాలని డిసైడ్ అయింది. బెంచ్ పై ఉండేవాళ్లు.. తమ స్కిల్స్ ను ఎప్పటికప్పుడు అప్డేట్స్ చేసుకునే అవకాశం కంపెనీ ఇస్తుంది. దాని ప్రకారం అప్‌డేట్ చేసుకుని ఏదో ఓ ప్రాజెక్టులో చేరిపోతే ఉద్యోగం ఉంటుంది. లేదంటే పోతుంది. ఇలా వారిని ఉద్యోగాల్లో ఉంచడానికి, ఉండటానికి అన్ని అవకాశాలు కల్పించిన తర్వాతనే లేఆఫ్స్ ప్రకటిస్తున్నారు కానీ.. వర్క్ లో ఉండగా.. మెయిల్స్ పంపడం లేదు.ప్రాజెక్టులు వస్తున్నప్పుడు ఐటీ కంపెనీలు.. బెంచ్ స్ట్రెంత్ నూ ఉంచుకుంటాయి. ఒకప్పుడు మ్యాన్ పవర్ అందుబాటు తక్కువగా ఉండేది. ఇప్పుడు ఓవర్ ఫ్లో అవుతోంది. పైగా ఆటోమేషన్ , ఏఐ సాంకేతికతలు రొటీన్ టాస్క్‌ల అవసరాన్ని తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా మాన్యువల్ టెస్టింగ్ వంటి రోల్స్‌లో అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇతర సంస్థలు కూడా ఇదే దారిలో నడిచే అవకాశం ఉందని ఇండస్ట్రీ నిపుణులు చెబుతున్నారు. ఇన్ఫోసిస్, విప్రో వంటి ఇతర ఐటీ సంస్థలు లాభదాయకతను కాపాడుకోవడానికి , క్లయింట్ డిమాండ్‌లకు అనుగుణంగా ఉండటానికి ఇలాంటి లేఆఫ్స్‌ను అనుసరించవచ్చని అంచనా. సైబర్‌సెక్యూరిటీ, డిజిటల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతికతలలో స్కిల్ గ్యాప్ కారణంగా ఈ లేఆఫ్స్ జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు సీనియర్ ఉద్యోగులు, ముఖ్యంగా మిడిల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నవారు, కొత్త సాంకేతికతలకు అనుగుణంగా రీస్కిల్ చేసుకోవడంలో విఫలమవుతున్నారు. ఏఐ , ఆటోమేషన్ ఐటీ రంగాన్ని రీషేప్ చేస్తున్నాయి. ఇది రీస్కిల్లింగ్ , అప్‌స్కిల్లింగ్ అవసరాన్ని బలంగా చెబుతోంది. సంస్థలు హై-వాల్యూ సర్వీసెస్ , అధునాతన సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నాయి. ఈ దిశగా ఉద్యోగులు దృష్టి పెట్టాల్సిందే.భారత ఐటీ రంగంలో అగ్రగామి సంస్థగా ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సంస్థ అచ్చం ఈ డైలాగ్ తరహాలోనే ఉద్యోగులను ఊచకోత కోస్తోంది. 2025లో 12,261 ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది, ఇది దాని మొత్తం 6,13,069 మంది ఉద్యోగులలో 2%ని సూచిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, నైపుణ్య అసమానతలు ఈ లేఆఫ్‌లకు ప్రధాన కారణాలుగా సంస్థ చెబుతోంది. ఈ నిర్ణయం మిడిల్, సీనియర్ స్థాయి మేనేజర్‌లపై ఎక్కువ ప్రభావం చూపనుంది, ఇది ఐటీ రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను రేకెత్తిస్తోంది.టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ ప్రకారం, 12,261 ఉద్యోగుల తొలగింపు నిర్ణయం అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, ఏఐ ఆధారిత ఆపరేటింగ్ మోడల్‌లు, నైపుణ్య అసమానతల కారణంగా తీసుకోబడింది. కంపెనీ గతంలో ఉద్యోగుల శిక్షణ, రీస్కిల్లింగ్‌పై గణనీయమైన పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈ చర్య అనివార్యమైందని పేర్కొన్నారు. ఈ లేఆఫ్‌లు ప్రధానంగా మిడిల్, సీనియర్ స్థాయి మేనేజర్‌లను లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ఇప్పటికే ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించబడింది. ఈ నిర్ణయం టీసీఎస్ యొక్క భవిష్యత్-సిద్ధమైన వ్యూహంలో భాగంగా, ఏఐ, కొత్త టెక్నాలజీలలో పెట్టుబడులను పెంచడానికి తీసుకున్న చర్యగా టీసీఎస్ పేర్కొంటోంది.కఠినమైన బెంచ్ పాలసీ ఈ లేఆఫ్‌లలో కీలక పాత్ర పోషించింది. కంపెనీ నిబంధనల ప్రకారం, ఉద్యోగులు ఏడాదిలో కనీసం 225 రోజులు ప్రాజెక్టులలో చురుకుగా పనిచేయాలి, బెంచ్‌పై (ప్రాజెక్టు లేని స్థితిలో) గరిష్టంగా 35 రోజులు మాత్రమే ఉండాలి. ఈ పాలసీని అమలు చేయడంలో విఫలమైన ఉద్యోగులను లేఆఫ్ పేరుతో తొలగిస్తోంది. ఈ విధానం ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోంది. కొంతమంది ఈ విషయంలో కోర్టును ఆశ్రయించారు. ఈ ఒత్తిడి, అనిశ్చితి ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.రంగంలో కొత్త నియామకాలు 2025లో 72% తగ్గాయి. ఇది ఉద్యోగ ఆకాంక్షులకు, ప్రస్తుత ఉద్యోగులకు సవాల్‌గా మారింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి అగ్ర కంపెనీలు కొత్త రిక్రూట్‌మెంట్‌ను దాదాపు నిలిపివేసి, ఉన్న ఉద్యోగులను తగ్గించడంపై దృష్టి సారించాయి. ఈ పరిస్థితి ఐటీ నిపుణులలో ఆందోళనను పెంచుతోంది, ఎందుకంటే కొత్త అవకాశాలు లేకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతున్నాయి. ఈ తగ్గుదల కారణంగా, ఐటీ రంగం ఒకప్పుడు రంగుల ప్రపంచంగా భావించబడిన ఆకర్షణను కోల్పోతోంది.ఆధారిత ఆటోమేషన్, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు టీసీఎస్ లేఆఫ్‌లకు ప్రధాన కారణంగా సీఈవో వెల్లడించారు. ఏఐ ఆపరేటింగ్ మోడల్స్ సంప్రదాయ ఐటీ రోల్స్‌ను తగ్గిస్తున్నాయి. క్లయింట్ డిమాండ్‌లో సంకోచం కంపెనీలను ఖర్చు తగ్గింపు చర్యలకు ఒత్తిడి చేస్తోంది. టీసీఎస్ ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీలో పెట్టుబడులను పెంచుతోంది, కానీ ఆశించిన ఫలితాలు రావడం లేదని సీఈవో వెల్లడించారు. మరో వైపు సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాల ప్రభావం కీలక రంగాలపై పడటం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాదిలో యువత ఎక్కువగా అధిక ఆదాయం ఉన్నవారు సాఫ్ట్ వేర్ ఉద్యోగులే అవుతున్నారు. వారు పెట్టే ఖర్చులు, పెట్టుబడుల కారణంగానే చాలా రంగాల్లో దూకుడు కనిపిస్తోంది. ఇప్పుడు మెల్లగా సాఫ్ట్ వేర్ రంగంలో మార్పులు వస్తున్నాయి. ఈ క్రమంలో లే ఆఫ్స్ సీజన్ వచ్చేసింది. సాధారణంగా మాంద్యం వల్ల లే ఆఫ్స్ ప్రకటిస్తారు..కానీ ఇప్పుడు ఏఐ, ఆటోమేషన్ వల్ల తొలగింపులు జరుగుతున్నాయి.మాస్ లే ఆఫ్స్ కారణంగా ఉద్యోగుల్లో ఓ రకమైన భయం నెలకొంది. ఉద్యోగ భద్రత గండంగా మారడంతో దీర్ఘకాలిక పెట్టుబడులపై వారు వెనుకడుగు వేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇళ్ల కొనుగోలు వంటి వాటిపై ఆలోచిస్తారు. ఇప్పటికే ఐటీ కారిడార్ ఉన్న హైదరాబాద్ వెస్ట్ లో రియల్ ఎస్టేట్ పరిస్థితి మెరుగుపడలేదు. మార్కెట్ కు మించి లగ్జరీ ప్రాజెక్టులు నిర్మించేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు ఇంకా డిమాండ్ తగ్గనుంది. సాఫ్ట్ వేర్ పరిశ్రమలో ఎంత పెద్దస్థాయిలో ఉన్నా.. సరే కాస్త ఆలోచిద్దామని అనుకునేవారి సంఖ్య పెరుగుతుంది.ఇతర రంగాల వారిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం ఎంత ఉంటుందన్నదానిపై అంచనాలు లేవు. అయితే రియల్ ఎస్టేట్ మందగిస్తే ఇతర రంగాల్లోనూ వ్యాపారాలు మందగిస్తాయి. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ అంతా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. ఎక్కడ బలహీనమైనా పరిస్థితి తారుమారవుతుంది. అందుకే.. కొంత కాలం ఇబ్బందికర పరిస్థితులు తప్పవన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# కవిత సీఎం అయితే...



**హైదరాబాద్, జూలై 29:**ఇటీవల జాగృతి మీటింగ్ లో ఎమ్మెల్సీ కవిత స్టేజ్ పైకి వచ్చే సమయంలో కొంతమంది సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. కవిత వారిని వారించినట్టు కనపడలేదు. ఆ నినాదాలు విని ఆమె బాగా సంతోషించారు. ఆ తర్వాత నిదానంగా ఏయ్ అల్లరి చేయకండి అంటూ సర్దిచెప్పారు. ఆరోజు జాగృతి తరపున బయటకు వచ్చిన వీడియోల్లో ఈ సన్నివేశం లేదు. కాస్త ఆలస్యంగా ఈ వీడియో బయటకు రాగా ఇప్పుడిది వైరల్ అవుతోంది. ఇంట్లో కుంపటి తీర్చు కెసిఆర్ ముందుఅక్కడ ఆ అన్నా చెల్లి కొట్టుకుంటున్నారు.కవిత సీఎం అయితే కేసీఆర్.. సీఎం సీఎం అంటూ నినాదాలు చేస్తుంటే వినడానికి బాగానే ఉంటుంది కానీ, సమయం సందర్భం లేకుండా జాగృతి మీటింగ్ లో కవిత వచ్చేటప్పుడు సీఎం సీఎం అనే నినాదాలు ఏంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పోనీ కవితే సీఎం అభ్యర్థి అనుకుంటే, మరి కేసీఆర్ ఏంకావాలని మరికొంతమంది లాజిక్ తీస్తున్నారు. అటు కేటీఆర్ ఏమో.. కేసీఆరే మన నెక్స్ట్ సీఎం అంటున్నారు. ఇంతకీ ఆ ఫ్యామిలీలో ఎంతమంది సీఎం అభ్యర్థులు ఉంటారు. అసలు బీఆర్ఎస్ పార్టీ ఫ్యూచర్ ఏంటో తెలియదు కానీ, సీఎం సీటుకి అప్పుడే పోటీ మొదలైందంటూ కౌంటర్లు పడుతున్నాయి. ముందు ఇంటి రాజకీయాలు చక్కబెట్టుకోవాలంటూ నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు. ఫ్యామిలీ పాలిటిక్స్.. పరిస్థితులు అనుకూలిస్తే రెండో దఫా అధికారం ముగిసేలోపు కేసీఆర్, కేటీఆర్ ని సీఎం చేస్తారని అనుకున్నారంతా. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే కేటీఆరే సీఎం అనే ప్రచారం జరిగింది. కానీ బీఆర్ఎస్ ఆ ఎన్నికల్లో బొక్కబోర్లా పడింది, ఆ తర్వాత ఎంపీ ఎన్నికల్లో సున్నా సీట్లతో మరింత దారుణ పరాభవం మూటగట్టుకుంది. ఆ తర్వాత కేటీఆర్ కి జ్ఞానోదయం అయింది. కేసీఆరే మన నెక్స్ట్ సీఎం అంటూ ఆయన పదే పదే చెప్పడానికి కారణం అదే. కేసీఆర్ ముందు వరుసలో ఉంటేనే బీఆర్ఎస్ కి కాస్తో కూస్తో ప్రజాదరణ ఉంటుంది, ఆయన్ని వెనక్కి నెట్టి కేటీఆర్ ముందుకొస్తే అంతే సంగతులు. హరీష్ వర్గం అప్పుడే పక్కకు వెళ్తుంది, మిగతా నాయకులు కూడా తలోదారి చూసుకుంటారు. అందుకే కేటీఆర్ తండ్రి పేరుని వాడుకోవాలని చూస్తున్నారు. కానీ ఆయనకు చెల్లెలి రూపంలో శత్రువు తయారైంది. కవిత రాజకీయం, కేటీఆర్ ని మరింత అభద్రతా భావంలోకి నెట్టేస్తోంది. మన నాయకుడు కేసీఆర్, మన బాస్ కేసీఆర్ అంటూ కవిత కూడా గతంలో పదే పదే ప్రస్తావించేవారు. అయితే ఇప్పుడామె రూటు మార్చినట్టు తెలుస్తోంది. సీఎం సీఎం అంటూ తనని పొగిడేస్తున్న అభిమానులను ఆమె ఎందుకు వారించలేదు? మనం అధికారంలోకి వస్తే సీఎం అయ్యేది కేసీఆరేనని ఆమె ఎందుకు చెప్పడం లేదు? అంటే కవిత మనసులో ఏదో ఉంది. బీఆర్ఎస్ కి ప్రత్యామ్నాయంగానే ఆమె జాగృతిని తెరపైకి తెస్తున్నారు. జాగృతి రాజకీయాలతో బీఆర్ఎస్ కి కానీ కేసీఆర్ ఫ్యామిలీకి కానీ సంబంధాలు లేవని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే సీఎం సీఎం అనే నినాదాలను ఆమె ఆస్వాదించారు. కవిత రాజకీయం ఎలా ఉన్నా.. కేసీఆర్ కుటుంబం మాత్రం ప్రజల్లో మరింత పలుచన అవుతోందని అంటున్నారు నెటిజన్లు.

## కొనసాగుతున్న ఆపరేషన్ మహదేవ్



**న్యూఢిల్లీ, జూలై 29:**జమ్ముకాశ్మీర్‌లో ఆపరేషన్ మహదేవ్ కొనసాగుతోంది. పహల్గామ్ దాడి ఉగ్రవాదులే లక్ష్యంగా ఆపరేషన్ మహదేవ్ చేపట్టారు. ఇప్పటికే ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. పహల్గామ్ ఉగ్రదాడికి కుట్ర పన్నిన సులేమాన్ అలియాస్ ఆసిఫ్, గత ఏడాది సోనామార్గ్ టన్నెల్ పేల్చివేత కుట్రలో పాల్గొన్న జిబ్రాన్, ఉగ్రవాది హమ్జా అఫ్గానీ హతమయ్యారు.హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు శాటిలైట్ ఫోన్ ఉపయోగించడంతో వెంటనే పారాకమాండోలు అప్రమత్తం అయ్యారు. ఉగ్రవాదుల నుంచి ఒక %వీ%4 కార్బైన్ రైఫిల్, ఇతర ఆయుధాలను భద్రతాదళాలు స్వాధీనం చేసుకున్నాయి. మరికొంతమంది ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా వర్గాల సమాచారంతో బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి.ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్ర దాడి ఘటనకు సులేమాన్ సూత్రధారి అని భద్రతా దళాలు భావిస్తున్నాయి. గతంలో పాకిస్థాన్ సైన్యంలో సులేమాన్ పని చేసినట్లు గుర్తించారు. ఆ తర్వాత లష్కరే తోయిబా కోసం సులేమాన్ పనిచేస్తున్నట్లు సమాచారం.ఓ వైపు పార్లమెంట్‌లో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరుగుతున్న వేళ పహల్గామ్ ఉగ్రదాడికి కుట్ర పన్నిన ఆసిఫ్ ఎన్‌కౌంటర్ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఘటన తరువాత శ్రీనగర్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. హర్వాన్–లద్వాస్ ప్రాంతంలో మరికొంతమంది ఉగ్రవాదులు నక్కినట్టు అనుమానిస్తున్నారు. ఉగ్రవాదుల ఏరివేతకు భద్రత బలగాలు కూంబింగ్‌ను కొనసాగిస్తున్నాయి.పహల్గామ్ దాడిలో 26 మంది టూరిస్టులను కాల్చిచంపారు ఉగ్రవాదులు. ఉగ్రవాద సంస్థకు చెందిన ఉగ్రవాదులు పహల్గామ్‌లో మారణహోమానికి పాల్పడ్డారు.

## రేవంత్ చేయి పట్టుకోనున్న రాజాసింగ్ !



**హైదరాబాద్, జూలై 29:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీకి రాజీనామా చేసిన తరువాత ఆ ఎపిసోడ్ పూర్తయ్యిందని అందరూ భావించారు. కానీ బీజేపీలో ఒక కొత్త డ్రామాకు తెరలేచింది. రాజాసింగ్ రాజీనామా విషయంలో పునరాలోచించాలని ఆ పార్టీకి చెందిన ఒక కార్యకర్త ఆయనతో ఫోన్లో మాట్లాడిన ఆడియో క్లిప్ బీజేపీ లో మరో చర్చకు దారితీసింది. ఆయన పార్టీలో ఉంటేనే బాగుంటుందని కొంతమంది నాయకులు భావిస్తున్నట్లు వారి అంతరంగాన్ని ఆ ఆడియో క్లిప్ ద్వారా బహిరంగపరచినట్లు తెలుస్తోంది. దానికి తోడు ఎంపీ అరవింద్ సైతం ఒక మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజాసింగ్ ఒక మిస్డ్ కాల్ తో పార్టీలో తిరిగి జాయిన్ అవుతారని కామెంట్ చేయడంతో మళ్లీ చర్చ ఊపందుకుంది. అయితే తాను బీజేపీలో తిరిగి చేరే ప్రసక్తే లేదని రాజా సింగ్ ప్రకటించడంతో పాటు అందుకు చేస్తున్న ప్రయత్నాలపై ఆయన ఎదురుదాడికి దిగడంతో దాదాపు ఆయన పార్టీతో తెగతెంపులు చేసుకున్నట్లు తెలుస్తోంది.తాను తిరిగి పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు చేస్తున్న ప్రచారాన్ని ఫేక్ అంటూ తిప్పికొట్టారు. పార్టీలో ప్రస్తుతం పరిస్థితి బాగోలేదని, రాష్ట్రంలో పార్టీ అభివృద్ధిని కొంతమంది అడ్డుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు.అలాగే మహిళా శక్తి పేరుతో కొంతమంది తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం తప్పని, తన నుంచి ఎవరికి హాని జరగదని స్పష్టం చేశారు.అయితే గోషామహల్ నుంచి మాధవీలతకు ప్రాతినిధ్యం కల్పించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోందిబీజేపీలో కరుడుకట్టిన హిందుత్వ వాదిగా పనిచేసిన రాజా సింగ్ అధ్యక్ష స్థానం ఇవ్వలేదని రాజీనామా చేసినట్లు వచ్చిన ఆరోపణలు తిప్పికొడుతూ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ రాజీనామా చేసినట్లు బహిర్గతమయ్యాడు. అయితే కరుడుకట్టిన హిందుత్వ వాది ఆయన ఈ నాయకుడు ఏ పార్టీలో చేరే అవకాశాలున్నాయనే విషయమై చర్చ ఊపందుకుంది. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎక్కువ అవకాశము ఉన్నట్లు గతంలో రేవంత్ రెడ్డి తో ఉన్న సాన్నిహిత్యం తో పాటు, ఈ మధ్య కాలంలో ముఖ్యమంత్రి పాలనపై ఆయన ప్రశంసల వర్షం కురిపించడం చూస్తుంటే ఎక్కువగా ఆయన ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## గోషా మహల్ అసెంబ్లీ స్థానానికి ఎట్టి పరిస్థితుల్లో ఉప ఎన్నిక రాదు

**స్పష్టం చేసిన స్థానిక ఎమ్మెల్యే రాజా సింగ్**

**హైదరాబాద్, జులై 29** గోషా మహల్ అసెంబ్లీ స్థానానికి ఎట్టి పరిస్థితుల్లో ఉప ఎన్నిక రాదని స్థానిక ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుందంటూ కొంత మంది సోషల్ మీడియా వేదికగా లేని పోని గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ.. ఒకటి రెండు రోజుల్లో ఢిల్లీ పెద్దలు తనను పిలుస్తారన్నారు. తన బాధలు వారికి చెప్పిన తర్వాత తాను బీజేపీలో తిరిగి చేరే అంశంపై క్లారిటీ ఇస్తానని చెప్పారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ అభ్యర్థి వ్యక్తిగతంగా పిలిస్తే.. వెళ్లి ప్రచారం చేస్తానని తెలిపారు.బీజేపీ రాష్ట్ర నాయకత్వం తనను గుర్తించకపోయినా.. తనను గుర్తించే వాళ్లు చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పుకొచ్చారు. వారంతా బయటకు వచ్చి మాట్లాడటానికి భయపడుతున్నారన్నారు. తాను వెళ్లి ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేస్తే అక్కడ బీజేపీ ఓటు బ్యాంక్ చాలా బాగా పెరిగిందని వివరించారు. తనపై ఎవరు ఎన్ని కుట్రలు చేసారో అన్ని తనకు తెలుసునని చెప్పారు.కేంద్ర మంత్రులు తనతో టచ్‌లోనే ఉన్నారని చెప్పారు రాజాసింగ్. తాను శివసేన, టీడీపీ, జనసేనలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. ఈ వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఇవన్నీ బీజేపీకి మిత్రపక్ష పార్టీలేనని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ కొత్త అధ్యక్షుడు రామచందర్ రావు బాగానే పని చేస్తున్నారంటూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన నేతృత్వంలో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

**అసలు జరిగింది ఇది..**

హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి ఇటీవల ఎన్నిక జరిగింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు ఢిల్లీలోని పార్టీ అగ్రనాయకత్వం ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. అయితే అదే సమయంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సైతం ఈ పదవికి నామినేషన్ దాఖలు చేసేందుకు అనుచరగణంతో కలిసి పార్టీ కార్యాలయానికి తరలి వెళ్లారు. అయితే ఆయన్ని పార్టీ కార్యాలయం లోపలికి వెళ్లకుండా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపం చెందారు.అనంతరం అక్కడే బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి, నాయకులకు ఒక దణ్ణం అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా లేఖను పార్టీ అగ్రనాయకులకు పంపారు. వారు వెంటనే దానిని ఆమోదించారు. దీంతో గోషామహల్ ఎమ్మెల్యే మరో పార్టీలో చేరతారంటూ ఓ ప్రచారం అయితే ఊపందుకుంది. ఇది సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అయింది.మరోవైపు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో జూబ్లీహిల్స్‌తోపాటు గోషా మహల్ అసెంబ్లీ స్థానాలకు ఒకే సారి ఉప ఎన్నిక వస్తుందంటూ ఓ ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు బీజేపీని విడిచి పెట్టవద్దంటూ ఢిల్లీలోని కొంత మంది ఆ పార్టీ నేతలు.. రాజాసింగ్‌కు సూచించినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా వారు పార్టీ అగ్రనాయకత్వంతో మధ్యవర్తిత్వం నెరుపుతున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ఎమ్మెల్యే రాజా సింగ్‌కు ఢిల్లీలోని బీజేపీ పెద్దల నుంచి పిలుపు వస్తుందని.. వారితో భేటీ తర్వాత మళ్లీ బీజేపీలో చేరే అంశంపై క్లారిటీ ఇస్తారనే ఓ చర్చ అయితే గోషామహల్‌లో సాగుతోంది. అదీకాక.. గత కొంత కాలంగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి, ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లు ఒక ప్రచారం అయితే సాగుతోంది.

## హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్



**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(మంగళవారం జులై 29) రాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులని ఆదేశించారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్‌లని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గ నిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని.. ఇందుకు సంబంధించి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## మళ్లీ హైడ్రా దూకుడు..

**అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం**


**హైదరాబాద్:** మూసీనది గర్భంలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. చాదరఘాట్ బ్రిడ్జి నుంచి పాత బస్తీ ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించారు. ఈ స్థలాన్ని వాహనాల పార్కింగ్ కోసం ఆక్రమణ దారులు వినియోగిస్తున్నారు. చదును చేసి షెడ్డులు నిర్మించి కిరాయికి ఇస్తున్నారు కబ్జాదారులు. మూసీ ఆక్రమణలపై హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు చేపట్టారు. 3.10 ఎకరాల మేర కబ్జా చేసి షెడ్డు నిర్మించి అక్రమ వ్యాపారం చేస్తున్నారు ఆక్రమణ దారు తికారంసింగ్. అలాగే 1.30 ఎకరాల మేర కబ్జా చేశారు ఆక్రమణ దారు పూనమ్ చాంద్ యాదవ్. 5.22 ఎకరాల మేర కబ్జా చేశారు జయకృష్ణ. కబ్జా చేసిన వారంతా అక్కడ షెడ్డులు వేసి.. వాటిని అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు. బస్సులు, లారీల పార్కింగ్ కోసం కిరాయికి ఇస్తూ ఆక్రమణ దారులు వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మూసీ గర్భంలో మట్టిపోసి షెడ్డులని నిర్మించినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. నర్సరీ బిజినెస్ నిర్వహణ, ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. హైడ్రా అధికారులు తీసుకుంటున్న చర్యలపై పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## నీటిని విడుదల చేసిన మంత్రులు...

**నల్గోండ:**మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ మంగళవారం నాడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసారు. ఐదు అడుగుల మేర మొత్తం 14 గేట్ల ద్వారా 78060 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటితో రసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ప్రస్తుత నీటి మట్టం 587.20 అడుగులు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం – 312.04 టీఎంసీలు. సాగర్ జలాశయం ప్రస్తుత నిల్వ – 305.62 టీఎంసీలు. ఇన్ ఫ్లో – 2,28,900 క్యూసెక్కులు. ఔట్ ఫ్లో – 1,18,790 క్యూసెక్కులు

## ఉగ్రవాదులకు మతం లేదు..



**న్యూఢిల్లీ, జూలై 29:**జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో పర్యాటకులను ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్చి చంపారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్ సభలో వెల్లడించారు. ఇది అత్యంత దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి జరిగిన వెంటనే భద్రతాబలగాలు అప్రమత్తమయ్యాయని, ఉగ్రవాదుల కోసం వేట ప్రారంభించడంతో పాటు వారు దేశం దాటకుండా ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పై లోక్ సభలో చేపట్టిన చర్చలో హోంమంత్రి అమిత్ షా ఈ రోజు మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టినట్లు వివరించారు.ఈ నెల 22న ఉగ్రవాదుల ఆచూకీ తెలిసిందని, దాచిగామ్ సమీపంలోని మహదేవ్ కొండల్లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో మహదేవ్ కొండల్లో గాలింపు చర్యలు చేపట్టి పహల్గామ్ ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షా తో పాటు ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు హతమార్చాయని వివరించారు. ఈ క్రమంలోనే తన ప్రసంగానికి పదే పదే అడ్డువస్తున్న ప్రతిపక్ష ఎంపీలకు అమిత్ షా చురకలంటించారు. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ను ఉద్దేశించి.. 'ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు' అంటూ కౌంటర్ ఇచ్చారు.పాకిస్థాన్ ను వెనకేసుకు వస్తే మీకు ఏమొస్తుందంటూ ప్రతిపక్ష ఎంపీలను నిలదీశారు. పాకిస్థాన్ తో మీరు చర్చలు జరుపుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఇటీవలి వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. పాక్ ను రక్షిస్తే మీకు ఏమొస్తుందని ప్రశ్నించారు. ఉగ్రవాదులు పాకిస్థాన్ కు చెందిన వారేనని తాము వెల్లడిస్తే ఆధారమేంటని చిదంబరం ప్రశ్నిస్తున్నారని షా గుర్తుచేశారు. ఉగ్రవాదుల దగ్గర పాకిస్థాన్ లో తయారైన చాక్లెట్లు దొరికాయని షా తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు పాకిస్థాన్ ను ఎందుకు వెనకేసుకు వస్తున్నారని హోంమంత్రి నిలదీశారు.పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెడితే దేశ ప్రజలతో పాటు ప్రతిపక్ష నేతలూ హర్షం వ్యక్తం చేస్తారని తాము భావించినట్లు అమిత్ షా పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలు, చర్చలో వారి ప్రవర్తన చూస్తుంటే ఉగ్రవాదులను తుదముట్టించడం వారికి ఎలాంటి సంతోషాన్ని కలిగించలేకపోయినట్లు తెలుస్తోందని అమిత్ షా ఆరోపించారు.

## కాల్పుల విరమించి మంచి అవకాశం జారవిడిచారు..

**అఖిలేష్ యాదవ్**



**న్యూఢిల్లీ:** విజయవంతంగా మిలటరీ ఆపరేషన్ నిర్వహించి అకస్మాత్తుగా కాల్పుల విరమణ జరపడం వెనుక లాజిక్ ఏమిటని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్రాన్ని నిలదీశారు. పాకిస్థాన్‌కు గట్టి సందేశం ఇచ్చే అవకాశాన్ని వదులుకున్నారని, వాళ్లకు ఒక గుణపాఠం చెప్పి ఉండాల్సిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అఖిలేష్ మాట్లాడారు. 'ముందుగా ఇండియన్ ఆర్మీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ప్రపంచంలోనే మన ఆర్మీ ముందంజలో ఉంది. వారి ధైర్యసాహసాలకు అందరం గర్విస్తున్నాం. ఆర్మీ ఈ ఆపరేషన్ చేపట్టినప్పుడు పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడింది. దీనితోపాటు పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది. ఛానెల్స్ చూస్తున్నప్పుడు కరాచీ మనది, లాహోర్ మనది, ఇప్పుడు పాక్ కూడా మనదే అనిపించింది. అలాంటి తరుణంలో ప్రభుత్వం ఎందుకు ఆపరేషన్‌ను వెనక్కి లాగిందనేది తెలుసుకోవాలనుకుంటున్నాం. కాల్పుల విరమణ ప్రకటనకు కారణం ఏమిటి? ప్రభుత్వమే ప్రకటన చేస్తుందని అంతా ఆశించాం. కానీ వాళ్లకున్న లోతైన మిత్రత్వం కారణంగా ప్రభుత్వం వాళ్ల మిత్రుడిని కాల్పుల విరమణ ప్రకటన చేయమని అడిగింది' అని పరోక్షంగా తానే యుద్ధాన్ని ఆపానంటూ డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకోవడాన్ని ప్రస్తావించారు.

# సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి



**ఖమ్మం, జూలై 29:**తెలంగాణలో భారీ వర్షాల కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయింది. ఫలితంగా విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఆటంకం ఏర్పడింది. నిల్వలు పడిపోయాయి.తెలంగాణవ్యాప్తంగాగత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీని కారణంగా అనేక చోట్ల జనజీవనం స్తంభించింది. కాగా భారీ వర్షాల ప్రభావం సింగరేణికార్యకలాపాలపైనా పడింది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి భారీ స్థాయిలో పడిపోయింది. వాస్తవానికి రోజుకు 2.20లక్షల బొగ్గు డిమాండ్ ఉండగా, వర్షాల కారణంగా సగటున లక్షన్నర టన్నుల కన్నా తక్కువ ఉత్పత్తి జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మరీ ముఖ్యంగా ఈ బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు అనేక పరిశ్రమలకు సరఫరా చేయాల్సి ఉండటంతో, ఆయా చోట్ల కొరత ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది.నిబంధనల ప్రకారం ప్రతి థర్మల్ కేంద్రంలో కనీసం 22 రోజులకు సరిపడా స్టోరేజీ ఉండాలి. కానీ భద్రాద్రి విద్యుత్ ప్లాంటులో ప్రస్తుతం, కేవలం 14 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నట్టు సమాచారంఇంకా చెప్పాలంటే, ఇలా 22 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు లేని ప్లాంట్లను రెడ్ లిస్ట్లో పెడతారు. మరోవైపు ఈ బొగ్గు ఉత్పత్తి కొరత తెలంగాణ మాత్రమే కాదు, ఏపీతో పాటు దేశవ్యాప్తంగా అనేక విద్యుత్ కేంద్రాలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్లోని రాయలసీమ విద్యుత్ కేంద్రం, తెలంగాణలోని భద్రాద్రి సహా దేశంలోని 13 ప్లాంటులకు బొగ్గు కొరత కనిపిస్తున్నట్టు పలు నివేదికలు చెబుతున్నాయి.దేశీయంగా ఉత్పత్తి పడిపోవడంతో పాటు విదేశాల నుంచి దిగుమతి కావాల్సిన బొగ్గులో కూడా జాప్యం కనిపిస్తుండటంతో నిల్వలు మరింత పడిపోయినట్టు కేంద్ర విద్యుత్ మండలి వెల్లడించింది.ఆంధ్రప్రదేశ్లోని విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు ఇంకా అందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.దేశంలోని 184 థర్మల్ ప్లాంట్లకు ఎప్పటికప్పుడు బొగ్గును సరఫరా చేయాలి. వీటికి 2.15లక్షల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ్ బెంగాల్లోని థర్మల్ ప్లాంట్లలో ప్రస్తుతం కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ఉపశమనం కలిగించే విషయం ఏంటంటే.. ఉత్తర భారతంలో ఉన్న ప్లాంట్లలో బొగ్గు కొరత పరిస్థితులు ఇంకా కనిపించలేదు.కోల్ ఇండియా గనుల నుంచి బొగ్గు సరఫరా నిత్యం జరుగుతోంది. ఉత్తరాదిన వర్షాల ప్రభావం ఉన్నప్పటికీ ఎలాంటి ఆటంకాలు లేవు.

## ధాన్యం కొనుగోలు టెండర్ల కుంభకోణం లో సీఎం రేవంత్ ,మంత్రి ఉత్తమ్ ,సివిల్ సప్లై కమిషనర్, అధికారుల పాత్ర

**మిల్లర్లనుంచి వసూలు చేసిన కాంగ్రెస్ నేతలు**

**ఈడీ, సీబీఐ, డీఆర్ఐ కి పిర్యాదు చేస్తాం**

**బీఆర్ఎస్ నేతలు**




**హైదరాబాద్:**పద్దెనిమిది నెలల క్రితం జరిగిన ధాన్యం కొనుగోలు టెండర్ల కుంభకోణం లో సీఎం రేవంత్ ,మంత్రి ఉత్తమ్ ,సివిల్ సప్లై కమిషనర్ ,అధికారుల పాత్ర ఉంది. మేము ఈ కుంభ కోణం పై ఎనిమిది సార్లు ప్రెస్ మీట్ పెట్టినా కాంగ్రెస్ నుంచీ గానీ ప్రభుత్వం నుంచి గానీ స్పందన లేదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ లో మా నేతలు కే టీ ఆర్ ,హరీష్ రావు ఈ అంశాన్ని లేవనెత్తినా స్పందన రాలేదు. హై కోర్టు ను కూడా ఆశ్రయించామ్ . ధాన్యం టన్నుకు 2230 రూపాయలు ఎక్కువగా బిడ్డర్లు రైస్ మిల్లర్ల నుంచి వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారు. అక్రమంగా డబ్బులు చేరిన ఖాతాల వివరాలు సేకరించాం. ఇందులో మనీ లాండరింగ్ జరిగింది. ఈ రోజు బీ ఆర్ ఎస్ పక్షాన మేము సేకరించిన ఆధారాలతో ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కు ఫిర్యాదు చేశామని అన్నారు. సీబీఐ కి డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్సు కు కూడా ఫిర్యాదు చేస్తున్నాం. మొత్తం 700 పేజీలకు పైగా బుక్ లెట్ తయారు చేసి దర్యాప్తు సంస్థలకు పంపుతున్నామని అన్నారు. కచ్చితంగా ఈ కుంభకోణం లో దోషులకు శిక్ష పడుతుంది. ఎవ్వరూ తప్పించుకోలేరు. బీజేపీ ఈ విషయం లో స్పందించక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ దొంగల ముఠా గా వ్యవహరిస్తోంది. దండుపాళ్యం ముఠా లాగా దోచుకుంటున్నారు. ఈ దోపిడీ ని బయట పెట్టా%శీ% .దర్యాప్తు సంస్థలు దొంగలను పట్టుకునే దాకా విశ్రమించాం. 423 కోట్ల రూపాయలు అక్రమంగా వివిధ అకౌంట్లలోకి బదిలీ అయ్యాయి. హైకోర్టు ఎన్ని సార్లు కౌటర్ దాఖలు చేయమన్నా ప్రభుత్వం చేయకపోవడమే కుంభ కోణం జరిగింది అనడానికి రుజువు. మేము ఈ కుంభ కోణం పై మాట్లాడుతున్నా అవినీతి కొనసాగుతూనే ఉందని అన్నారు.మాజీ మంత్రి కమలాకర్ మాట్లాడుతూ తొంభై రోజుల్లో 35 లక్షల టన్నుల ధాన్యాన్ని అమ్మేందుకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో మొదట్నుంచి ఇప్పటివరకు అవకతవకలు జరిగాయి. ప్రభుత్వ ఖజానా లోకి రావాల్సిన డబ్బులు ప్రైవేట్ వారి ఖాతాల్లోకి వెళ్లాయి. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఈ అంశం పై ఫిర్యాదు చేసినా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయలేదు . .బీ ఆర్ ఎస్ కార్యకర్తల పై చిన్న ఫిర్యాదు చేస్తేనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేస్తున్నారు . దర్యాప్తు సంస్థల మీద మాకు నమ్మకముంది. ఏసీబీ ఈ కుంభకోణం పై ఎందుకు స్పందించదు ? ఈ కుంభ కోణం పై రాష్ట్రం తో పాటు కేంద్రం లో ఎన్ని దర్యాప్తు సంస్థలు ఉన్నాయో అన్నింటికి ఫిర్యాదు చేస్తున్నాం . కేంద్ర మంత్రులు బండి సంజయ్ ,కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు తెరవాలిని అన్నారు.ఈ ప్రెస్ మీట్ లో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ,కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,వాసుదేవ రెడ్డి ,సతీష్ రెడ్డి ,బీ ఆర్ ఎస్ నేత బొమ్మెర రామమూర్తి పాల్గొన్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టిన కవిత

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**హైదరాబాద్:**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టింది. బీసీ రిజర్వేషన్స్ కోసం మా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో పార్టీ అంతా ఢిల్లీ వెళ్లి కేంద్రప్రభుత్వం పైన పోరాటం చేస్తామని ప్రకటిస్తే కవిత మాత్రం డ్రామాలకు సిద్ధమైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. నిరాహార దీక్ష చేస్తామని కవిత చెపుతుంది ..ఆమె ఏ హొదాలో దీక్ష చేస్తుంది? బీసీ లపైన చిత్తశుద్ధి ఉంటే మీ అయ్య ను తీసుకొని వచ్చి ఢిల్లీ లో బీజేపీ సర్కార్ పైన పోరాడు. ఆయన ఫార్మ్ హౌస్ లో పడుకుంటాడు..నువ్వు మీ అన్న డ్రామా లు ఆడుతున్నారు. బీజేపీ పైన మాట్లాడడానికి మీకు నోరు రాదు . మోడీ ని చూసి నువ్వు,మీ అయ్యా వణికిపోతున్నారని అన్నారు.తెలంగాణ లో దీక్ష చేయాల్సిన అవసరం ఏముంది? అసెంబ్లీ బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపాం. ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ కి పంపాం. మా చిత్త శుద్ధి లో ఏం లోపం ఉంది? మీ కల్వకుంట్ల డ్రామాలను తెలంగాణ ప్రజలు నమ్మరని అన్నారు.

# ఒక్క ఏడాదిలో ముగ్గురు కమిషనర్లా..




**హైదరాబాద్, జూలై 29:**బల్దియాకు ఏడాది కాలంలోనే ముగ్గురు కమిషనర్లు వచ్చారు వెళ్లారు. ఇప్పుడు బల్దియాను నాలుగో కమిషనర్ నడిపిస్తున్నాడు. ఏ ముహూర్తాన వాళ్లు గ్రేటర్ ఆఫీస్లో అడుగు పెడుతున్నారో కానీ..కాంట్రవర్సీలు, వివాదాలకు కేరాఫ్గా మారుతున్నారు. ఇప్పుడు లేటెస్ట్గా బల్దియా బాస్ ఆర్వి కర్ణన్ తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఇప్పటికే ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదం కాగా తాజాగా ఆయన వైఖరిని నిరసిస్తూ ఉద్యోగులు ధర్నాకు దిగడం బల్దియాలో హాట్ టాపిక్ అయింది. తెలంగాణకు తలమానికం భాగ్యనగరం. హైదరాబాద్ మహానగరాన్ని శాసించే బల్దియా బాస్లు ఎప్పుడూ ఏదో ఒక ఇష్యూతో వార్తల్లో ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటికే నలుగురు కమిషనర్లు మారారు. రోనాల్డ్ రాస్ తర్వాత ఆమ్రపాలి..ఇలంబర్తి ఇలా కమిషనర్లు వస్తున్నారు..అలా చూస్తుండగానే పోతున్నారు. ఇక తాజాగా కమిషనర్ బాధ్యతలు చేపట్టిన ఆర్వీ కర్ణన్ చుట్టూ వివాదాలు చుట్టుకుంటున్నాయి.కారణాలేవైనా తరచూ కమిషనర్లు మారుతుండటంతో బల్దియా పరిస్థితి గందరగోళంగా మారింది. ఇలంబర్తి కమిషనర్గా ఉన్నప్పుడు లోపాలను సరిదిద్ది, అడ్డగోలు వ్యవహారాలకు చెక్ పెట్టే ప్రయత్నం చేశారన్న చర్చ ఉంది. అనేక అంశాలు గాడిన పడుతున్నాయన్న సందర్భంలోనే అనూహ్యంగా ఆయన్ను బదిలీ చేయడంతో..పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రోనాల్డ్రాస్, ఆమ్రపాలి కూడా గ్రేటర్ని అర్థం చేసుకొని, గాడిలో పెట్టే టైమ్లోనే బల్దియా నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. తరచుగా కమిషనర్లను మార్చడం..అభివృద్ధి పనులు నిలిచిపోవడం..నిధుల కొరత కారణంగా జీహెచ్ఎంసీలో పాలన పడకేసే పరిస్థితి వచ్చిందంటున్నారు.ఇక తాజాగా కమిషనర్గా వచ్చిన ఆర్వి కర్ణన్ తీరుపై ఏకంగా ఉద్యోగులు ఆందోళన చేయడం చర్చనీయాంశం అవుతోంది. గతంలో ఏ కమిషనర్ తీరుపై కూడా ఉద్యోగులు నేరుగా ఆందోళనకు దిగిన దాఖలాలు లేవు. శానిటేషన్లోని పర్మినెంట్ కార్మికులకు, శానిటరీ సూపర్ వైజర్లకు బయోమెట్రిక్ పెట్టాలని నిర్ణయించడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అంతేకాదు ట్యాక్స్ ఇన్స్పెక్టర్లకు, బిల్ కలెక్టర్లకు ట్రేడ్ లైసెన్స్ జారీ..అడ్వర్టైజ్మెంట్ ఫీజు వసూలు పనులు అప్పగించారు కమిషనర్ కర్ణన్.నిబంధనల ప్రకారం ఆ పనులు లైసెన్స్ ఆఫీసర్లు లేదా మెడికల్ అధికారులు చేయాల్సి ఉండగా తమకెందుకు అప్పగిస్తారంటూ కార్మికులు రోడ్డెక్కారు. కమిషనర్ చేసిన ఈ మార్పు ఇప్పుడు బల్దియాలో హాట్ టాపిక్గా మారింది. ఇంతకు ముందు మాన్సూన్ టీమ్స్ కోసం ఈసుజి వెహికల్స్ కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచిన సమయంలోనూ కర్ణన్పై ఆరోపణలు గుప్పుమన్నాయ్. దీంతో వర్షాకాల ఎమర్జెన్సీ బృందాలను ఏకంగాగ్రేటర్ నుంచి తప్పించి హైడ్రాకు అప్పగించింది సర్కార్.ఇక శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సానిటరీ జవాన్లకు బయోమెట్రిక్ పద్ధతిలో అటెండెన్స్ తీసుకోవాలని నిర్ణయించడంపైనా తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అడిషనల్ కమిషనర్లను, డిప్యూటీ కమిషనర్లను ఇష్టారాజ్యంగా బదిలీలు చేశారనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. అడిషనల్ కమిషనర్లుగా ఉన్న నలుగురు అధికారుల్లో ఇద్దరిని మంత్రిత్వశాఖకి పంపించగా%ౌ% మరొక ఇద్దరిని జాయింట్ కమిషనర్లుగా నియమించారు. దాంతో వాళ్లిద్దరు తమ పోస్టును తగ్గించారనే అసంతృప్తితో లాంగ్ లీవ్పై వెళ్ళిపోయారు.మరోవైపు వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో ఒకేసారి 20మందికిపైగా డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేయడం కూడా వివాదాస్పదంగా మారింది. ట్రాన్స్ఫర్లతో కొత్తగా వెళ్లిన ప్రాంతాల్లో వర్షాకాల ఇబ్బందులను పరిష్కరించడంలో సదరు డిప్యూటీ కమిషనర్లు ఇబ్బందులు ఫేస్ చేస్తున్నారు. బదిలీల విషయంలో కూడా కమిషనర్ అత్యుత్సాహంగా వ్యవహరించారన్న విమర్శలు వస్తున్నాయ్.గ్రేటర్ పనిచేసే ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు రెండు పనులను అదనంగా కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు కమిషనర్ ఆర్వి కర్ణన్. ఇంతకాలం లైసెన్స్ ఆఫీసర్లు వసూలు చేసే ట్రేడ్ లైసెన్స్ ఫీజు బాధ్యతను బిల్ కలెక్టర్లకు, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లకు అప్పచెప్పారు. అంతేకాకుండా అడ్వర్టైజ్మెంట్ ఫీజులు కూడా వారే వసూలు చేయాలంటూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు ఏకంగా కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. వేల కోట్ల రూపాయల ఆస్తి పన్నులు వసూలు చేయడానికే తమకు టైమ్ సరిపోడం లేదని..కొత్తగా ఈ పనులు అప్పజెప్తే ఎలా పని చేయాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు పని పెరిగిపోగా మరొకవైపు టార్గెట్లు రీచ్ కావడం లేదంటూ మెమోలు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టం ప్రకారం ఇతరులు చేయాల్సిన పనులను తమతో చేయించడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నిస్తున్నారు. వారి వాదనలోనూ నిజముందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎవరితో ఏ పని చేయించుకోవాలన్న అవగాహన లేకపోవడంవల్లే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రేటర్ ఎన్నికల ముందు కమిషనర్ కర్ణన్ తీసుకుంటున్న నిర్ణయాలు సర్కార్కు సమస్యగా మారే అవకాశాలున్నాయన్న టాక్ విన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల దాకా అయిన ప్రస్తుత కమిషనర్ ఉంటారా? లేదా అనుభవజ్ఞులెవరినైనా ఐదో అధికారిని కమిషనర్గా సర్కార్ దింపుతుందో చూడాలి మరి..

# కమలం వైపు మల్లారెడ్డి చూపా...?

**హైదరాబాద్, జూలై 29:**మాజీ మంత్రి, బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పక్క చూపులు చూస్తున్నారన్న గాసిప్స్ వైరల్ అవుతున్నాయి. ఆయన గులాబీ పార్టీలో ఉన్నా చూపంతా పక్క పార్టీలపైనే ఉందని చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. లోక్సభ ఎన్నికలకు ముందే మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారన్న ప్రచారం జరిగింది. తన సన్నిహితుల ద్వారా ప్రయత్నం కూడా చేశారనే టాక్ నడిచింది.రెండు మూడు సందర్భాల్లో నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మరీ హస్తం పార్టీ తీర్థం పుచ్చుకోవడానికి ట్రై చేశారనే చర్చ జరిగింది. ఎలా గెలుస్తావో చూస్తానంటూ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ ను తొడగొట్టి సవాల్ చేసిన మల్లన్న%ౌ% ప్రతిపక్షంలోకి మారగానే రేవంత్రెడ్డిని తన మనవరాలు పెండ్లికి పిలిచి..మనవళ్లతో సీఎం కాళ్లు మొక్కించారు. లాస్ట్కు బెంగళూరుకు వెళ్లి కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ను కూడా కలిసి వచ్చారు మల్లారెడ్డి. అయినా కాంగ్రెస్ గూటికి చేరేందుకు క్లియరెన్స్ రాలేదట. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్లోనే కొనసాగుతున్న మల్లన్న..ఎంతో అవసరమైతే తప్ప పెద్దగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని చెబుతున్నారు.అధికార కాంగ్రెస్లో చేరదామనుకుంటే సాధ్యం కాలేదు కాబట్టి కనీసం బీజేపీలోకైనా వెళ్దామని మల్లన్న భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం తనదైన స్టైల్లో పావులు కదుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. తన ఎంట్రీ కంటే ముందు తన కోడలు ప్రీతిరెడ్డిని బీజేపీలోకి పంపేందుకు మల్లారెడ్డి ప్లాన్ చేస్తున్నారట. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి బండి సంజయ్తో మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి భేటీ అయ్యారని అంటున్నారు.పాతబస్తీలో బోనాల సందర్భంగా మేకల మండికి చెందిన ఓ బీజేపీ నేత ఇంట్లో బండి సంజయ్తో ప్రీతిరెడ్డి లంచ్ మీటింగ్లో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ప్రీతిరెడ్డి, బండి సంజయ్ ఫోటోలతో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయడం చర్చకు దారి తీసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోడలు అయిన ప్రీతిరెడ్డి..బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్తో భేటీ అవడం పొలిటికల్ టాపిక్ అయింది. ప్రస్తుతం మల్లారెడ్డి విద్యాసంస్థల బాధ్యతలు చూస్తున్నారు ప్రీతిరెడ్డి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మల్లారెడ్డి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు.2024 లోక్సభ ఎన్నికల్లో మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డిని బరిలో దింపాలని అనుకున్నా తర్వాత ఆ ఆలోచనను విరమించుకున్నారు. అప్పటి నుంచే మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీపై కొంత అసంతృప్తితో ఉంటూ వస్తున్నారట. ఇప్పుడు ఆయన కోడలు ప్రీతిరెడ్డి బీజేపీవైపు అడుగులేస్తున్నారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్కు, బండి సంజయ్కి గ్యాప్ ఉందంటూ ప్రచారం జరుగుతుండటం..ఇద్దరి కోల్డ్ వార్ రచ్చకెక్కిన నేపథ్యంలో..గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఆశించిన ప్రీతిరెడ్డితో బండి సంజయ్ భేటీ అవడం హాట్ టాపిక్ అవుతోంది. మల్కాజ్గిరి నియోజకవర్గంలో మల్లారెడ్డి కుటుంబానికి ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని ఈటల రాజేందర్కు చెక్ పెట్టేందుకు బండి సంజయ్ ప్లాన్ చేస్తున్నారా అన్న చర్చ మొదలైంది.ఈ రాజకీయ సమీకరణాల్లో భాగంగానే కేంద్ర మంత్రి బండి సంజయ్తో మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి భేటీ అయ్యారనే టాక్ వినిపిస్తోంది. బండి, ప్రీతిరెడ్డి లంచ్ మీటింగ్పై బీఆర్ఎస్ పార్టీలోనూ చర్చ జరుగుతోంది. టైమ్ చూసి మల్లారెడ్డి బీఆర్ఎస్ను వదిలి జంప్ అయ్యేందుకు రెడీ అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో తనతో పాటు కొడుకు భద్రారెడ్డి లేదంటే కోడలు ప్రీతిరెడ్డిని పోటీ చేయించే యోచనలో మల్లారెడ్డి ఉన్నట్లు చెబుతున్నారు.సేమ్ టైమ్ బీజేపీలోకి వెళ్తే తన విద్యాసంస్థలకు, బిజినెస్కు ఎలాంటి ఇబ్బంది ఉండదని భావిస్తున్నారట. కారులోనే ఉంటారా? కమలం గూటికి వెళ్తారా? అనేది మల్లారెడ్డి చెప్తే గానీ క్లారిటీ వచ్చేలా లేదు. కారు గుర్తుపై మేడ్చల్, మల్కాజిగిరి నుండి గెలిచిన మామ, అల్లుళ్లు మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి లు వచ్చే ఎన్నికల దాకా బీఆర్ ఎస్ లోనే కొనసాగినా కోడలిను మాత్రం కమలదళంలో చేర్చడం ఖాయమనే టాక్ నడుస్తోంది.



# మీర్ ఆలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి

**రంగారెడ్డి, జూలై 29:**అభివృద్ధిలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నగరం హైదరాబాద్. అనేక మందికి ఉపాధి కేంద్రంగా మారింది. దేశ విదేశాల నుంచి ప్రజలు, ఉద్యోగులు, కూలీలు ఉపాధి నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. పర్యాటకంగా కూడా నగరానికి గుర్తింపు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఫ్యూచర్ సిటీ నిర్మిస్తోంది. మరోవైపు కేంద్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను ఆధునీకీకరిస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సిగలోకి మరో నగ అలంకరించబోతోంది. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి విజయం తర్వాత, మీర్ ఆలం చెరువుపై రెండో కేబుల్%- స్టేడ్ బ్రిడ్జి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ వంతెన నగర రవాణా సౌలభ్యాన్ని మెరుగుపరచడమే కాక, ఆర్థిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపును తీసుకొస్తుందని భావిస్తున్నారు.కొత్త కేబుల్%-%స్టేడ్ బ్రిడ్జి హైదరాబాద్లోని మీర్ ఆలం చెరువుపై నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడే ఎందుకు అంటే.. ఇది చింతల్మెట్ రోడ్ను బెంగళూరు నేషనల్ హైవేతో అనుసంధానిస్తుంది. ఈ వంతెన ఓల్డ్ సిటీలోని బహదూర్పురా ప్రాంతంలో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడానికి రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటోంది. అంచనా వ్యయం సుమారు రూ.363 కోట్లుగా ఉండగా, వంతెన మొత్తం పొడవు 2.65 కిలోమీటర్లు, ఇందులో ప్రధాన వంతెన, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంప్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ను సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా ఒక కీలక దశ.మీర్ ఆలం చెరువు కేబుల్ బ్రిడ్జి నాలుగు లేన్ల హై%-%లెవల్ వంతెనగా



రూపొందించబడుతుంది, ఇది రవాణా సౌలభ్యంతోపాటు చూడడానికి ఆకర్షణగా కూడా ఉంటుంది. ఈ వంతెన డిజైన్లో దుర్గం చెరువు వంతెన లాంటి ఎక్స్ట్రాడోస్డ్ కేబుల్%-%స్టేడ్ సాంకేతికతను అనుసరించే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో రంగురంగుల లైటింగ్, ఆధునిక డిజైన్తో ఈ వంతెన నగరంలోని పర్యాటక ఆకర్షణలకు మరో మణిహారంగా మారనుంది. నాలుగు లేన్ల డిజైన్ రద్దీని తగ్గించి, సమర్థవంతమైన రవాణాను సాధ్యం చేస్తుంది. తక్కువ పిల్లర్లతో నిర్మాణం జరిగేలా రూపొందించబడి, చెరువు పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గిస్తుంది. వంతెన చుట్టూ వినోద కేంద్రాలు, వాణిజ్య కార్యకలాపాల అభివృద్ధికి ఊతం ఇస్తుంది. స్థానిక ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ ప్రాజెక్టును స్వాగతిస్తూ, ఇది స్థానికులకు వినోద, ఆర్థిక అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు.

## వాటర్ ట్యాంక్ ఢీకొన్ని మహిళ మృతి

**హైదరాబాద్:** మణికొండ సుందర్ గార్డెన్ సమీపంలో వేగంగా వస్తున్న వాటర్ ట్యాంక్ ను యాక్టీవా వాహనం ఢీకొని శాలిని మృతి చెందింది. మణికొండ ప్రాంతంలో నివసిస్తున్న శాలిని తన పిల్లల్ని స్కూల్లో దింపి తిరిగి ప్రయాణం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం

**న్యూఢిల్లీ:**అండమాన్ నికోబార్ దీవుల్లో సోమవారం అర్ధరాత్రి 12:11 గంటలకి 6.2 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. కాంప్బెల్ బేకు 62 కి.మీ. దూరంలో భూమి ఉపరితలం నుండి 10 కి.మీ లోతులో ప్రకంపనలు వచ్చాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. హిందూ మహాసముద్రంలో, అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు అధికారులు.. దీని కేంద్రం ఇండోనేషియాలోని సబాంగ్కు 259 కి.మీ దూరంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# చిత్తశుద్ధి అకుంఠిత దీక్షతో అనేక అవార్డులు

రేపు కండక్టర్ పాలాది సాయిబాబా పదవి విరమణ సభ.



**నాగర్ కర్నూల్ జులై 29 (స్కైన్యూస్)** విధి నిర్వహణలో ఆర్టీసీలో కండక్టర్ గా సేవలు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనడం వల్ల పాలాది సాయిబాబా అనేక అవార్డులను అందుకున్నారు. విధి నిర్వహణలో ఎక్కడ ఏ డ్యూటీ వేసిన తనదైన శైలిలో ఇది నిర్వహణలో లక్ష్యాన్ని చేదించి మారుమూల గ్రామ ప్రజలకు కూడా సేవలు అందించారు. మారుమూల గ్రామాలకు డ్యూటీ పై వెళ్లాలంటేనే ఇబ్బందులు పడే కండక్టర్ డ్యూటీలో చాలా సంవత్సరాల పాటు గంగారం బిజినపల్లి లట్టుపల్లి గ్రామాల బస్సుకు కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఆ ప్రాంత ప్రజలతో మమేకం కావడం వల్ల ఆ ప్రాంతంలో కండక్టర్ సాయిబాబా అంటే తెలియని వారు చాలా అరుదు. విధి నిర్వహణతోపాటు వాసవి క్లబ్ అధ్యక్షునిగా విస్తృత సేవలు అందించిన ఆయన ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లో వివిధ గ్రామాలకు వెళ్లే బస్సు షెల్టర్ల నిర్మాణానికి మరియు గ్రామాలలో ప్రయాణికుల ప్రాంగణాలను దాతల సహకారంతో నిర్మించారు. వాసవి క్లబ్లో కూడా ఆయన చేసిన సేవలకు రీజియన్ స్థాయిలో మంచి గుర్తింపును పొందారు అటు విధులు ఇటు సేవలలో నిరంతరం గడిపే ఆయన 1965 లో గౌరరం గ్రామంలో సుగుణమ్మ వాసు దేవయ్య దంపతులకు జన్మించారు. 1991లో పరిగి డిపోలో ఆర్టీసీ కండక్టర్గా బాధ్యతలు చేపట్టారు అనంతరం నేటి వరకు నిరంతరం సేవలు అందిస్తూ సంస్థ అధికారులు ఆదేశించిన బాధ్యతలను పూజా తప్పకుండా పాటిస్తూ సమస్త బలోపేతానికి వివిరామంగా కృషి చేశారు. ఎందరికో ఉపాధి కల్పించడంలో కూడా ఆయన వెనకడుగు వేయకుండా అటు కుటుంబ సభ్యులనే కాకుండా అనేకమందికి అండగా నిలిచారు అలాంటి కండక్టర్ పలాది సాయిబాబా ఈనెల 31న ఉద్యోగ విరమణ చేపట్టనున్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

- వైభవంగా ముగిసిన జిల్లా మహాసభలు- సభల్లో పలు తీర్మానాలు ఆమోదం
- ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి
- స్థానిక ఎన్నికల్లో బఖ్యంగా ముందుకు సాగుదాం
- బలమైన కేంద్రాల్లో సత్తాచాటుదాం.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



**కొత్తగూడెం జులై 29( స్కై న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారమే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన ఎజెండా అని, ఆ సమస్యల పరిష్కారం కోసం ఎందాకైనా, ఎవ్వరితోనైనా పోరాటం చేసేందుకు సిద్ధం అని ఆ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా తెలిపారు. మంగళవారం శేషగిరి భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంగా ఈనెల 26,27 తేదీల్లో సిపిఐ జిల్లా 3వ మహాసభలు అత్యంత ఘనంగా జరిగాయని, ఆ మహాసభల్లో 30 మందితో జిల్లా కార్యవర్గాన్ని, 79 మందితో కౌన్సిల్ ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. మహాసభల కంటే ముందే 22 రెవెన్యూ మండలాలు, 3 మున్సిపాలిటీలు, 1 నగరపాలక సంస్థ పరిధిలో 713 గ్రామశాఖల మహాసభలు జరిపామని, జిల్లా వ్యాప్తంగా సిపిఐలో 13474 మంది శాశ్వత ప్రాథమిక సభ్యత్వం కలిగిన వారు ఉన్నట్లు జాతీయ నాయకత్వ సూచనల మేరకు కమిటీలో 10 శాతం యువతకు, మరో 10 శాతం మహిలకు ప్రధాన్యత కల్పించామని, మహాసభ వేధికగా 49 తీర్మాణాలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నదీ జలాలు జిల్లాలోని ప్రతీ ఎకరాకు అందించాలని, కొత్తగూడెం, ఇల్లెందుల్లో ఓపెన్ కాస్టు బొగ్గు గనులను తక్షణమే ప్రారంభించాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో కళాక్షేత్రాలు నిర్మించాలని, నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యారంగానికి కేంద్ర బడ్జెట్లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తూ బకాయిలు విడుదల చేయాలని, ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయితీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో కలపాలని, పేదల సాగులో ఉన్న మిగులు పోడు భూములకు పట్టాలివ్వాలని, జాతీయ ఉపాధిహామీ పథకంలో 200 పనిదినాలు, రోజుకు రూ.600 చెల్లించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, జర్నలిస్టులు, అడ్వకేట్లకు నామినల్ ధరకే ఇండ్ల స్థలాలు అందించి ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, స్వామినాధన్ కమీషన్ మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మహిళలకు విద్యా, వైద్య రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని, మహిళ రక్షణ చట్టాలు, సంక్షేమ చట్టాలు అమలు చేయాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, తెలంగాణ ఉద్యమ కారులకు 200 గజాల ఇల్లు, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరీ చేయాలని, అశ్వారావుపేట కేంద్రంగా రెవెన్యూ డివిజన్, ఆర్టిసి డిపో, హర్టీకల్చర్ యూనివర్సిటి, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని, పాల్వంచ కేంద్రంగా ఎరువుల కర్మాగారం, కేటిపిఎస్లో 800 మెగా వాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో పెండింగ్లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, భద్రాచలం గోదావరి కరకట్ట నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేసి వరద ముంపు నుండి గ్రామీణ ప్రాంతాలకు రక్షణ కల్పించాలనే తిర్మాణాలతో పాటు పలు తీర్మాణాలు ఆమోదం పొందాయన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నూతన నాయకత్వం ముందుకు సాగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలుపుకోవాలని, హామీల అమలు కాకుంటే ప్రశ్నించేందుకు, వాటి సాధనకు వెనుకడుగు వేసేది లేదన్నారు. జిల్లాలో సిపిఐ బలమైన నిర్మాణాన్ని కలిగిఉందని, సభ్యత్వం కలిగి వారే కాకుండా ర్యాలీలు, సభల్లో 40 నుండి 50వేల మంది పాల్గొంటున్నారని చెప్పారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా ఎర్రజెండా రెపరెపలాడాలని, క్రిందిస్థాయి నుండి పార్టీ సంస్థగత నిర్మాణం మరింత బలంగా మారాలాని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, అసెంబ్లీ ఎన్నికల ఒప్పందంలో భాగంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఐఖ్యంగా పనిచేద్దామని, బలమైన స్థానాల్లో గతంలో మాదిరిగానే మన సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్టి సలీం, మున్నా లక్ష్మీ కుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, భూక్య దస్రు, వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, అడుసుమిల్లి సాయిబాబు, మువ్వా వెంకటేశ్వరరావు, కందుల భాస్కర్, బి వీరస్వామి, ఉప్పుశెట్టి రాహూల్, ఎస్ కే ఫహీమ్, అడ్డగర్ల తాతాజీతోపాటు కౌన్సిల్ సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన తీన్మార్ మల్లన్న టీం...



**నాగర్ కర్నూల్ జులై 29 (స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను తీన్మార్ మల్లన్న టీం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పరశురాం మాట్లాడుతూ పాఠశాలలోని వంటగది పరిశుభ్రంగా ఉందా, లేదా ఆహార పదార్థాలు నిల్వ చేసే విధానం ఏలా ఉంది. వంట చేసే పరికరాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా అని అలాగే బియ్యం, పప్పు ,కూరగాయలు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వంట చేసే సిబ్బందితో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం పాఠశాలలో ఆహారం తయారు చేస్తున్నారా లేరా అని , తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో నీటి సమస్య ఉందని, నీరు తాగాలంటే బయటకు వెళ్లి తాగాల్సి వస్తుందని విద్యార్థులు తెలిపారు.అనంతరం మధ్యాహ్నం భోజనం విద్యార్థులతో కలిసి తీన్మార్ మల్లన్న టీం సభ్యులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు, శివ, సల్మాన్, వసీం, రాజు, దేవా తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని విద్యాహబ్ మారుస్తా...

లక్ష్యం ఏర్పాటుతోనే ఉత్తమ ఫలితాలు.

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి.

**నాగర్ కర్నూల్ జిల్లా 29 (స్కైన్యూస్)** రాబోయే రోజులలో విద్యారంగాన్ని నియోజకవర్గంలో తీర్చిదిద్దడంతోపాటు విద్యా హబ్ గా మారుస్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డి అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకం ద్వారా ఉత్తమ పాఠశాలగా ఎంపిక అయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ శ్రీలత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలలో ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి విద్య ద్వారా అనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని భావించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిర్విరామంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా విద్యను కొనసాగిస్తూ అన్ని రంగాలలో రాణించి ఉన్నత అధికారులుగా ఉన్నత స్థానాలలో నిలిచి నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఇప్పటికే మెడికల్ కళాశాలను ప్రారంభించడం జరిగిందని మరో సంవత్సరంలో ఇంజనీరింగ్ కళాశాలను కూడా ఇక్కడ ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల నూతన నిర్మాణానికి



అదనపు తరగతుల గదుల నిర్మాణాలకు కనీస సౌకర్యాలను కల్పించేందుకు నిధులను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఘనస్వాగతం పలికే సందర్భంలో తనకు తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని ఎన్ఎస్ఎస్ ద్వారా ఎంతో నైపుణ్యం విద్యార్థులు ప్రదర్శించారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ బోధన జరిగేలా ఒకవైపు కృషి చేస్తున్న మరోవైపు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం జరుగుతుందని అన్నారు మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మాట్లాడుతూ స్వశక్తి పట్టుదల




వల్ల విద్యార్థులు ఎంపిక చేసుకున్న లక్ష్యాన్ని సునాయాసంగా సాధించవచ్చు అని అన్నారు. డాక్టర్ గా ఎమ్మెల్యేగా ఉన్నటువంటి డాక్టర్ రాజేష్ రెడ్డి విద్యావేత్త కావడం వల్ల చాలా గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలకు నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీలత ఎంఈఓ భాస్కర్ రెడ్డి ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ బాబు తదితరులు ప్రసంగించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సాహకాలు అందించారు అదేవిధంగా నందిని అనే అమ్మాయి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు

# సిపిఐ 3వ మహాసభలను విజయవంతం చేయాలి



**తాడూర్ జులై 29 (స్కైన్యూస్)** భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మూడో మహాసభలను జిల్లాలోని కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1 మరియు 2 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో 100 సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేసి ప్రజా హక్కులను కాపాడడం జరిగిందని తెలిపారు. 1న జరిగే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావుతో పాటు ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో కొమ్ము భరత్ మారేడు శివశంకర్ వెంకటస్వామి సత్యం శ్రీనివాసులు ఆంజనేయులు రామకృష్ణ నారాయణ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# కోస్గి ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జూలై 29 (స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణ, అడ్మినిస్ట్రేషన్ గురించి ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కళాశాల స్టాఫ్ ను అడిగి తెలుసుకున్నారు. ఆ కళాశాల భవనంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల తరగతులు కూడా కొనసాగుతుండడంతో తరగతి గదుల కొరత ఉందని, అలాగే పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ లేదని ప్రిన్సిపల్ శ్రీనివాసులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం కొనసాగుతుండగా, మరి కొన్ని రోజులలో రెండో సంవత్సరం తరగతులు కూడా ప్రారంభం కానుండటంతో అదనంగా ఎన్ని గదులు



అవసరం అవుతాయని, ల్యాబ్ లు, కంప్యూటర్లు, బాలికల హాస్టల్, ఇతరత్ర సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ తో గంటపాటు చర్చించారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులతో పాటు ఖాళీగా ఉండే గదులను వినియోగించుకునే విషయమై కలెక్టర్ ప్రిన్సిపల్ కు తగు సూచనలు చేశారు. తర్వాత కళాశాలలోని తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, ఇతర గదులను ఆమె పరిశీలించారు. అనంతరం పట్టణంలోని



సర్వే నంబర్ 1737 లో గల 10.08 ఎకరాలలో నిర్మించబోయే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థలాన్ని, అలాగే సర్వే నంబర్ , 1809, 1811,1812 గల 7ఎకరాలలో నిర్మించే ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, పంచాయతీరాజ్ డీ ఈ విలోక్, ఆర్ అండ్ బి డీ.ఈ. రాములు తదితరులు పాల్గొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137